క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): 11 కేవీ 19వ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం డీ-1 సెక్షన్ పరిధిలో బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-1 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ ముస్తాక్ అహమ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 1వ లైన్ నుంచి 4వ లైన్ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నెహ్రూకు ఘన నివాళి



లక్ష్మీపురం: భారత దేశ తొలి ప్రధాన మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూలాలను సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధులపై అసభ్యకరంగా కించపరుస్తూ మాట్లాడిన తెలుగు సినీ పరిశ్రమ కొరియోగ్రాఫర్ శ్రేష్టి వర్మ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో మదన్, జానీ, ఏసుబాబు, నాగూర్, బాబు, చిన్న, అర్బాజ్, గౌస్, నారాయణ పాల్గొన్నారు.

యువతకు నైపుణ్య శిక్షణతో కూడిన ఉపాధి

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ ఎస్సీ యువకులకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి కల్పించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీడాప్, లిడ్‌క్యాప్ సంయుక్త సంస్థల ఆధ్వర్యంలో స్టిచ్చింగ్ ఆపరేటర్, ఫుట్‌వేర్, కట్టర్ ఫుట్‌వేర్ కోర్సుల్లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనంతో కూడిన శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9948716888 లో సంప్రదించాలన కోరారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు

పట్నంబజారు: శివ భక్తుల కోసం పవిత్ర అరుణాచలంలో జరిగే పౌర్ణమి గిరి ప్రదక్షిణకు సంబంధించి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మంగళవారం తెలిపారు. జూన్ 11న పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు జూన్ 9వ తేదీ రాత్రి 9.15 గంటలకు బస్సు బయల్దేరుతుందని చెప్పారు. 10వ తేదీ గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, శ్రీకాళహస్తి దర్శించుకుని అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 11వ తేదీ గిరిప్రదక్షిణ, స్వామి దర్శనం పూర్తయిన తరువాత అదేరోజు రాత్రి బయల్దేరి 12వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని వివరించారు. ఈ సర్వీసుకు సంబంధించి 96164 నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. ఒక టికెటు ధర రూ. 2,420 నిర్ణయించినట్లు తెలిపారు. వివరాల కోసం 7382897459లో సంప్రదించాలని సూచించారు.

బాలిక ఆత్మహత్య

లక్ష్మీపురం: పదో తరగతిలో నూరు శాతం మార్కులు రాలేదని తండ్రి మందలించడంతో బాలిక ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై మంగళవారం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్యామలానగర్‌కు చెందిన సైపుద్దీన్, సలీమా పశ్చిమ బెంగాల్ నుంచి గుంటూరు వచ్చి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. పదో తరగతిలో 950 మార్కులు రావడంతో తండ్రి మార్కులు శాతం తక్కువ వచ్చిందని మందలించాడు. దీంతో కుమార్తె గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేశారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణతరగతులు

పెదకాకాని: విద్యార్థులు మహనీయుల చరిత్రపై అవగాహన కలిగి ఉండటం ద్వారా క్రమశిక్షణ, పోరాట తత్వం తెలుసుకోవడంతో పాటు పోటీ పరీక్షలకు దోహదపడుతుందని రిసోర్స్‌పర్సన్ భాను తెలిపారు. పెదకాకాని గ్రంథాలయంలో లైబ్రేరియన్ వేముల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన వేసవి విజ్ఞాన తరగతులు 30వ రోజుకు చేరాయి. ఈ శిక్షణా తరగతుల్లో బాగంగా మంగళవారం స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, యోగా, పుస్తక ప్రదర్శన, ఇన్‌డోర్ గేమ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ భానుచే విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా సోషల్ క్లాసు చెప్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు త్వరలో నిర్వహించి బహుమతులు అందజేయడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి తెలియజేశారు.

వర్షాలతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు

కమిషనర్ పులి శ్రీనివాసులు



పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల వలన లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు లేకుండా టెండర్ పొందిన పనులను త్వరగా ప్రారంభించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. విద్యా నగర్, కృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా టెండర్ పొందిన పనులను జాప్యం లేకుండా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కోరారు. వర్షాల వలన లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా ప్రతిపాదించిన రోడ్లు, డ్రెయిన్లను తక్షణం ప్రారంభించి, వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. పనుల్లో జాప్యం జరిగితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్న నేపథ్యంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. నూతన బహుళ అంతస్తు భవన నిర్మాణదారులు తప్పనిసరిగా డ్రెయిని మేజర్ డ్రెయిన్‌లోకి కనెక్ట్ చేసేలా, ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో రోజువారి చెత్త సేకరణకు ప్రజారోగ్య కార్మికులు రావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, సచివాలయం పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ బాధ్యత శానిటేషన్ కార్యదర్శిదేనని స్పష్టం చేశారు.

ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జయకుమార్



గుడివాడ జయకుమార్

గుంటూరు మెడికల్: నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గుడివాడ జయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా ఎం.కోటేశ్వరరావు, కోశాధికారిగా బాలశివారెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం 2027 వరకు కొనసాగనుంది. నూతనంగా ఎన్నికైన జయకుమార్ మీడియాతో మాట్లాడుతూ ప్లాస్టిక్ తయారీ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రా, రాయలసీమ ప్రాంతాల్లో ప్లాస్టిక్ కారిడార్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ కారిడార్‌ల ఏర్పాటు వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయన్నారు. సంఘ సభ్యులకు అసోసియేషన్‌కు స్థలం కేటాయించి నూతన భవన నిర్మాణం చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

కవిత్వంతో కాసేపు



లలితాకుమారి నివాసంలో కవులు

నగరంపాలెం: కవిత్వం మనుషులను ఒకటి చేస్తుందని సరస్వతీ పుత్ర డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రతినెలా నిర్వహిస్తోన్న కవిత్వంతో కాసేపు మంగళవారం బ్రాడీపేట 4/19వ అడ్డరోడ్డులోని సంఘ సభ్యులు డాక్టర్ మైలవరపు లలితకుమారి స్వగృహంలో నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవిత్వం రాయాలనుకునే వారు ఇతర సాహిత్యరీతులను చదివి పరిశీలించడం చాలా అవసరమని అన్నారు. కవిత్రయంలో తిక్కన రచనా శైలిలోని ఉపమాన ఉపమేయ పదాల పొందికను గుర్తుచేశారు. తెలుగు వాడు తెనాలి వాసైన సంజీవదేవ్, అదే విధంగా రాహుల్ సాంకృత్యాయన్ రచనలు చదవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. సంఘ సభ్యులు శ్రీవశిష్ఠ సోమేపల్లి, నానా ఇటీవల పెదపరిమిలో జరిగిన ఓ మీట్ అనుభూతులను గుర్తుచేశారు. కవులందరూ కలవడం, కవిత్వంపై చర్చించడం, సాయంత్రం పచ్చని పచ్చికపై కూర్చుని కవితలు చదువుతూ, చదివిన కవిత ఎందుకు బాగుంది, ఇంకా బాగుండాలంటే ఏం చేయాలనే చర్చ అందరికి మంచి ఉత్సాహాన్ని, స్ఫూర్తినిచ్చిందని వారు తెలియజేశారు. అనంతరం కవులు తమ స్వీయ కవితలతోపాటు ఇతర కవుల కవితలను చదివారు. అనంతరం కవులను లలితకుమారి దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్. ఎం.సుభాని, కవులు తాటికోల పద్మావతి, సుభద్రాదేవి, మెట్టు శ్రీనివాసరెడ్డి, సి.సురేష్, బండికల్లు జమదగ్ని, కొణతం నాగేశ్వరరావు, మైలవరపు రామశేషు పాల్గొన్నారు.

అహల్యబాయి హోల్కర్‌కు నివాళి

గుంటూరు మెడికల్: అహల్యబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అరండల్‌పేటలోని పిచుకలగుంట గ్రౌండ్‌లో అహల్యబాయి చిత్రపటానికి పలువురు బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, మహిళ మోర్చా అధ్యక్షురాలు ఎస్.నాగమల్లేశ్వరి యాదవ్, భజరంగ్ రామకృష్ణ, చైతన్యకృష్ణ, యోగ గురువులు ఆళ్ల రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి

డీఎల్‌పీఓ కె.శ్రీనివాసరావు



ప్రత్తిపాడు: చెత్త నుంచి సంపద సృష్టించి, గ్రామాభివృద్ధికి వినియోగించాలని డీఎల్‌పీఓ కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును మోడల్ గోల్డెన్ ఎల్‌టీసీ సెంటర్‌గా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం డీఎల్‌పీఓ షెడ్డును పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ పచ్చని మొక్కలతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటం హర్షించదగ్గ విషయమన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ బిన్ బ్యాగ్‌లు అందించాలన్నారు. పంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగుతూ తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచేలా డోర్ టు డోర్ తిరిగి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజాను ఆదేశించారు. వెంట డీపీఆర్‌సీపీలు, డిప్యూటీ ఎంపీడీఓ, క్లాప్‌మిత్రలు ఉన్నారు.

దేశరక్షణ వ్యవస్థలో భాగస్వాములవ్వాలి



శిక్షణకు హాజరైన విద్యార్థులు

క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్. సుదర్శన్

ప్రత్తిపాడు: భారతదేశ రక్షణ వ్యవస్థలో భాగస్వాములయ్యేందుకు ఎన్‌సీసీ విద్యార్థులు సిద్ధంగా ఉండాలని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్.సుదర్శన్ అన్నారు. గుంటూరురూరల్ మండలం ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో సీఏటీసీ-1 ఎన్‌సీసీ క్యాంప్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్.సుదర్శన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. తరగతులకు గుంటూరు, పల్నాడు, ప్రకాశం నెల్లూరు జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల నుంచి 710 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ తరగతులతో సైనిక శిక్షణలో ప్రాథమిక దశను పూర్తి చేసుకోవడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చన్నారు. జూన్ నాలుగు వరకు జరగనున్న శిక్షణలో విద్యార్థులకు యోగా, ఆయుధ శిక్షణ, ఫైరింగ్, ట్రెక్కింగ్, ఫిజికల్ ట్రైనింగ్, నాయకత్వ లక్షణాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఫైర్ అండ్ సేఫ్టీ డ్రిల్, ఎన్‌డీఆర్ఎఫ్ ట్రైనింగ్.. వంటి అనేక అంశాలపై ఎన్‌సీసీ అధికారులు, నిపుణులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సామాజిక సేవలో, ఎన్‌సీసీ విద్యార్థుల పాత్ర అభినందనీయమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.జగదీష్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అకడమిక్ అండ్ ఆర్-డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశి పట్వాల్, క్యాంపు సీనియర్ జేసీఓ షేక్ ఇమాం సాహెబ్, క్యాంపు ట్రైనింగ్ జేసీఓ ఆర్ఎస్ రాజు, క్యాంపు సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖర బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పంచకావ్యాలలో మొదటిది శృంగార నైషధం



మాట్లాడుతున్న శ్రీరంగనాయకి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో శృంగార నైషధముపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించా రు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ కోగంటి వేంకటశ్రీ రంగనాయకి ప్రవచిస్తూ శ్రీనాథుని శృంగార నైషధం తెలుగు పంచకావ్యాలలో మొదటిదని అన్నారు. ఇది నల, దమయంతిల ప్రేమకథను వర్ణిస్తుందని చెప్పారు. నలరాజు, దమయంతిని వివాహం చేసుకున్నాక వారు కలిసే కథ అని అన్నారు. ఈ కథను శ్రీహర్షుడు సంస్కృతంలో నైషధ మహాకావ్యంగా రాశాడని పేర్కొన్నారు. శ్రీనాథుడు దాన్ని తెలుగులోకి అనువదించారని, శృంగార నైషధం నల, దమయంతిల ప్రేమను వారి జీవితంలోని వివిధ సంఘటనలను అందంగా వర్ణిస్తుందని అన్నారు. కథలో నలరాజు, దమయంతి నరకయాత్రా కష్టాలను ఎలా ఎదుర్కున్నారు, వారు ఒకరికి ఒకరూ ఎలా మళ్లీ కలిశారనేది తెలియజేస్తుందని అన్నారు.

జూన్ 2న పేదల ఇళ్ల స్థలాల కోసం ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, సీపీఐ నేతలు

లక్ష్మీపురం: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ జూన్ 2న తాలూకా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం పేదలకు ఇచ్చి ఇళ్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో 2 సెంట్లు స్థలం ఇస్తే, ఆ సమయంలో ఇది చాలా అన్యాయం అని చంద్రబాబు విమర్శించారని గుర్తు చేశారు. ఈ స్థలం ఇంటికి సరిపోదని ప్రతిచోట జరిగిన సమావేశాల్లో చెప్పిన చంద్రబాబు, తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు ఇచ్చి, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి రూ.4 లక్షలు ఇస్తామని ఎన్నికల్లో ప్రచారం చేశారన్నారు. తెనాలిలో పోలీసులు ప్రవర్తన దారుణంగా ఉందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు నగరంలో అర్హులైన పేద ప్రజలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ హనుమంతరావు మాట్లాడారు.. అనంతరం 2న జరిగే ధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అరుణ్ కుమార్, షేక్ వలి, సమితి సభ్యులు జంగాల చైతన్య పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల జీవితాలతో చెలగాటం




తహసీల్దార్ దినేష్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటమాడుతోందని ఎండీయూ వాహనాలకు కాలపరిమితి ఉన్నా ఇంటింటికి రేషన్ అందించే వ్యవస్థను రద్దు చేయడం దారుణమని పలువురు ఎండీయూ వాహన డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం అసోసియేషన్ సభ్యులంతా మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మంగళగిరి వడ్లపూడి సెంటర్ నుంచి గౌతమ బుద్ధ రోడ్‌మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ఎండీయూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. గౌతమ బుద్ధ రోడ్‌పై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎండీయూ ఆపరేటర్లు మాట్లాడు తూ 2027 జనవరి వరకు అగ్రిమెంట్లు ఉన్నప్పటికీ వాటి ని రద్దు చేసి కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. 2021లో కరోనా వంటి ఉపద్రవంలో కూడా తమ జీవితాలను పణంగా పెట్టి ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా విధులు నిర్వహించి ప్రజలకు రేషన్ అందించామని అన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లతో ఆర్థికాభివృద్ధి

వెలుగు ఏపీఎం వి.లాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం

ప్రత్తిపాడు: స్వయం ఉపాధి యూనిట్లతో మహిళలు ఆర్థిక పురోగతి సాధించవచ్చని ప్రత్తిపాడు వెలుగు ఏపీఎం వి.లాజరు అన్నారు. యాన్యువల్ క్రెడిట్ లైవ్‌లీ హుడ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు, పెదగొట్టిపాడు గ్రామాల్లో మైక్రో క్రెడిట్ ప్లాన్‌ల తయారీపై డ్వాక్రా గ్రూపులకు సమావేశాన్ని నిర్వహించారు. హాజరైన ఏపీఎం లాజరు మండలంలో ఈ ఏడాది 930కు పైగా గ్రూపులకు ఎంసీపీలు తయారు చేసి బ్యాంకులకు పంపడం జరుగుతుందన్నారు. సంఘాల్లో ఉన్న సభ్యులంతా స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకునేందుకు బ్యాంకర్ల సహకారంతో రుణాలిప్పించడం జరుగుతుందని ఏపీఎం చెప్పారు. అందుచేత గ్రామైఖ్య సంఘాల సభ్యులు, గ్రూపుల లీడర్లు సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఎంసీపీలు పక్కాగా తయారు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతను అందిస్తుందని వివరించారు. సమావేశంలో వీవోఏలు, డ్వాక్రా లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం

ఏపీ జీఈఏ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా



మాట్లాడుతున్న చాంద్‌బాషా

గుంటూరు వెస్ట్: జూన్ 5న విజయవాడలో నిర్వహించనున్న మూడో రాష్ట్ర కౌన్సిల్‌సమావేశానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో చాంద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ పిలుపు మేరకు ఉద్యోగులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులకు ఒక వేదికను ఏర్పాటు చేసి, అసాంఖ్యాకంగా ఉన్న సమస్యలను ప్రస్తావిస్తామని, పరిష్కారాలకు మార్గాలను అన్వేషిస్తామని చాంద్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సుమిత్రా దేవి, అరుణకుమారి, సుల్తానా, ఆలిషు పాల్గొన్నారు.

ఆదాయం పెంపుదలకు చర్యలు తీసుకోవాలి



కొండమడుగుల శ్రీనివాసరెడ్డి



వెనిగండ్లలో నిర్మించిన మైత్రీ కల్యాణ మండపం

పెదకాకాని: గ్రామ పంచాయతీకి ఆదాయం పెంచేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వెనిగండ్ల గ్రామ మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన మైత్రీ కల్యాణ మండపంలో నిర్వహించే ప్రోగ్రాంలకు లైటింగ్, డెకరేషన్ చేసే వ్యక్తులు పంచాయతీకి రూ.25 వేలు చెల్లించి సభ్యత్వం తీసుకోవాలన్నారు. ప్రోగ్రాం నిర్వహించే వ్యక్తి పగలు రూ.2500, రాత్రి సమయంలో ప్రోగ్రాం చేస్తే రూ.5వేలు చెల్లించేలా ఈ ఏడాది ఏప్రిల్ 19వ తేదీపాలకవర్గం తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ తీర్మానం విధి విధానాలను మే నెల ప్రారంభం అయ్యేలా పంచాయతీ బోర్డు నిర్ణయించారన్నారు. ఈ విధానం ద్వారా పంచాయతీకి ఆదాయం పెరగడంతో పాటు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్, డెకరేషన్ పనులు చేసే వారికి ఉపాధి కలుగుతుందని తీర్మానించడం జరిగిందన్నారు. ప్రస్తుతం పంచాయతీ అధికారులు పాలకవర్గం నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పంచాయతీకి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని, గ్రామానికి చెందిన వారికి ఉపాధి కల్పించాలని శ్రీనివాసరెడ్డి కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న కమిషనర్, క్లబ్ సభ్యులు



ప్రత్తిపాడులో యోగాసనాలు వేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు

పొన్నూరు: ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఆరోగ్యవంతమైన జీవనం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని లయన్స్‌క్లబ్‌లో యోగా గురువులతో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూన్ 20 వరకు యోగా మాసంగా పరిగణించి సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం యోగాకు సమయం కేటాయించాలన్నారు. విద్యార్థులలో యోగా సాధనతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ శిక్షణా తరగతులను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రత్తిపాడు: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీఓ కె.శివపార్వతి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఓటీలకు ఐదు రోజుల పాటు జరగనున్న యోగ శిక్షణ తరగతులను మంగళవారం ఎంపీడీఓ ప్రారంభించారు. ఆయా గ్రామాలకు చెందిన టీఓటీలకు ఎంఓటీలు యోగాభ్యాసాలపై శిక్షణచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో నేర్చుకున్న యోగసనాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. యోగాతో ఆరోగ్యం అభిస్తుందని చెప్పారు.

పంచముఖ ఆంజనేయుడికి విశేష పూజలు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్ లో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక శ్రీహనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి విశేష పూజలు, మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 1108 అరటి పండ్లతో విశేష పూజాది కార్యక్రమాల్లో నిర్వహించారు.180 మంది భక్తులు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస పండితులు నాగ మారుతి బృందం ఆగమోక్తంగా కార్యక్రమాలను జరిపారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అర్చకులు కిరణ్ కుమార్, సురేష్, కౌన్సిలర్ పి.త్రిమూర్తి, దాతలు కారంశెట్టి అమర్‌నాథ్, తాతా శ్రీనివాసరావు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు PUSHKAR JUNEJA, S/o. Krishan Kumar Juneja, Residing at Door No. 4-5-29/79, Vidya Nagar, 4th Line, Guntur, Guntur District గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా..

నా క్లయింటు గుంటూరు జిల్లా, గుంటూరు సిటీ, నెహ్రూనగర్, వి.టి.సి, ఫస్టు లైన్ డోరు.నెం. 8-10-266రు కాపురస్తులు 1) చింతా చంద్రశేఖర రావు గారి కుమారులు 1) చింతా నాగ ప్రసాద్ గారున్నూ, 2) చింతా కిరణ్ కుమార్ గారున్నూ, చింతా రాధాకృష్ణ గారి భార్య 3) చింతా కళ్యాణి గారున్నూ, వీరి కుమార్తెలు 4) చింతా విమల గారున్నూ, 5) చింతా నవ్య గారున్నూ, 6) చింతా సుష్మ గార్లకు చింతా సుబ్బారావు గారి కుమారుడు చింతా చంద్రశేఖర రావు గారి ద్వారా సంక్రమించిన స్థిరాస్తి అనగా సదరు చింతా చంద్రశేఖర రావు గారు వారి స్వార్జితపు సొమ్ము ది. 25-09-1991వ తేదిన The Andhar Pradesh Industial Infrastructure Corporation Limited, Hyderabad, Represented By Deputy General Manager (Development) వారి ద్వారా క్రయం పొంది చింతా చంద్రశేఖర రావు పేరుతో విక్రయ దస్తావేజు వ్రాయించుకొని సదరు దస్తావేజును గుంటూరు సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 7766/1991రుగా రిజిష్టరు కాబడి సదరు చింతా చంద్రశేఖర రావు సంక్రమించిన స్థిరాస్తి వారు నిర్మల ఇండస్ట్రీస్ అను పేరుతో వ్యాపారం చేయుచూ వారి తదనంతరము వారి వారసులైన చింతా కిరణ్ కుమార్ వగైరాలకు సంక్రమించిన దర్శిలా యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని విక్రయించుటకు ప్రయత్నం చేయగా మా క్లయింటు క్రయం పొందుటకు నిర్ణయించుకొని కొంత సొమ్మును బయానాగా చెల్లించి విక్రయ ఖరారుపడి విక్రయ బయానా అగ్రిమెంటు పొందియున్నారు. యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి సదరు చింతా చంద్రశేఖర రావు గారి తదనంతరము చింతా కిరణ్ కుమార్ వగైరాలు మాత్రమే వారసులని సదరు స్థిరాస్తి వారి స్వాధీన హక్కు భుక్తములలో యుండియున్నదని వారికి మాత్రమే సర్వ హక్కులుగలవని ఎవరికి ఏ విధమైన హక్కులు లేవు అని సదరాస్తిపై తనఖాలు, భాగ లబ్ధి తగాయిదాలు, కోర్టు కేసులు, కోర్టు జప్తులు, ఇంజక్షన్ ఆర్డర్లు విక్రయ అగ్రిమెంట్లు, బయానా రశీదులు వగైరాలు ఏమియూ లేవు అని మా క్లయింటును నమ్మించి విక్రయించబోవుచున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై ఎవ్వరికైనను హక్కులు గాని తనఖాలు, భాగ లబ్ధి తగాయిదాలు, కోర్టు కేసులు, కోర్టు జప్తులు, ఇంజక్షన్ ఆర్డర్లు విక్రయ అగ్రిమెంట్లు, బయానా రశీదులు వగైరా అభ్యంతరములు ఉన్న యెడల యీ ప్రకటన తేది నుండి 10 రోజులలోగా వ్రాత పూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా మాకు తెలియజేయగలరు. లేనిచో ఆ తదుపరి వచ్చు క్లయిములు గాని అభ్యంతరములు వగైరాలు చట్ట రీత్యా చెల్లనేరవు మరియు నా క్లయింటు ఏ విధముగా బైండు చేయజాలవు.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్.డి., పెదకాకాని సబ్ రిజిష్ట్రారు వారి యిలాకా, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరిన, పెదకాకాని మండలం, ఆటోనగర్, ఫేస్ నెం. 3రు, ప్లాటు నెం.61రు, దాఖలా అగతవరపాడు గ్రామ సర్వే నెం.179రు, చ.గ. 972-16లు, స్థిరాస్తి స్థలము అందలి ఆర్.సి.సి గ్రౌండ్ ఫ్లోర్ దాబా మరియు ఏ.సి.సి రేకుల షెడ్డునకు హద్దులు: తూర్పు: అ 50-0 వెడల్పు గల రోడ్డు అ. 120-0, దక్షిణం: ప్లాటు నెం. 62, 63రు దాఖలా ఆస్తి హద్దు. అ. 82-0, పడమర: ప్లాటు నెం. 60రు దాఖలా ఆస్తి హద్దు. అ. 120.0 ఉత్తరం: అ 60-0 వెడల్పు గల రోడ్డు. అ.65-6.

యీ నాలుగు హద్దుల మధ్య గల చ.గ.972-16లు లేక చ.మీ.811-046ర్లు స్థిరాస్తి నివేశన స్థలము, అందలి ఆర్.సి.సి. మరియు ఏ.సి.సి. రేకుల కట్టడములతో సహాయున్నూ.

ఇట్లు: తుక్కూరు సూరిబాబు, న్యాయవాది

కొండపల్లి కాంప్లెక్స్, షాపు నెం. 5, ఫస్ట్ ఫ్లోర్, గాంధీనగర్, విజయవాడ-3